## పశువుల అక్రమ రవాణాపై తనిఖీలు

ఎస్‌పి రాజేష్ మీనా



**ప్రజాపక్షం/ వనపర్తి :** వనపర్తి జిల్లా నుండి ఎట్టి పరిస్థితుల్లోనూ పశువుల అక్రమ రవాణా జరగకుండా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా అన్నారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పెబ్బేరులోని సంతలో శనివారం రోజు అదనపు ఎస్పీ రాజేష్ మీనా వనపర్తి జిల్లా పెబ్బేరు పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టణ కేంద్రంలో ప్రతి శనివారం భారీ స్థాయిలో నిర్వహించే పశువుల సంతను ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం జాతీయ రహదారి సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసి అక్కడి భద్రతా ఏర్పాట్లు, విధుల నిర్వహణ తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ... పశువుల రవాణా చేసే వ్యక్తుల వద్ద తప్పనిసరిగా వెటర్నరీ అధికారుల అనుమతి పత్రాలు ఉన్నాయా లేదా అన్న విషయాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలించే వారి పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవలని ఆదేశించారు. చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహించే సిబ్బంది షిఫ్టుల వారీగా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని, ఎవరు కూడా విధుల్లో అలసత్వం, ప్రదర్శించరాదని హెచ్చరించారు. తనిఖీ చేసిన ప్రతి వాహనం వివరాలను రిజిస్టర్ లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. అదేవిధంగా చెక్‌పోస్ట్ విధుల్లో ఉన్న సిబ్బందికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను ఆదేశించారు. ప్రజల సహకారంతోనే పశువుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టగలమని, అనుమానాస్పద వాహనాలు లేదా అక్రమ రవాణా సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అదనపు ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట సీఐ రామ్ బాబు, పెబ్బేరు ఎస్సై వెంకటేష్ గౌడ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి

జెడ్‌పి మాజీ వైస్ చైర్మన్ డాక్టర్ కొడుగల్ యాదయ్య


**ప్రజాపక్షం/జడ్చర్ల:** కేంద్ర ప్రభుత్వ నిన్న పెట్రోల్ డీజిల్ ధరలు లీటర్ కు మూడు రూపాయలు పెంచి సామాన్య ప్రజలపై భారం మోపడం జరిగింది. కొడగల్ యాదయ్య మాట్లాడుతూ భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ వాహనాలను తక్కువ వినియోగించాలని, ప్రజల మీద భారం పడకుండా చూసుకోవాలి అని చెప్పి వారం గడవకముందే వారు చెప్పిన మాట ముర్వకముందే పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి ప్రజలకు తీరని అన్యాయం చేయడం జరిగింది. ఇప్పటికైనా సామాన్య ప్రజలపై భారం పడకుండా ఉండేందుకు వీలుగా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వంని డిమాండ్ చేస్తున్నాను అని అన్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/కల్వకుర్తి:** కల్వకుర్తి మండల పరిధిలోని రఘుపతి పేట గ్రామానికి చెందిన చంద్రయ్య (40) దుందుభి వాగు సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యచేసుకున్న ఘటన చోటుచేసుకోంది. కల్వకుర్తి ఎస్సై కురుమూర్తి తెలిపిన వివరాల మేరకు రఘుపతి పేట గ్రామానికి చెందిన చంద్రయ్య భార్య అనితతో ఆర్థిక, కుటుంబ గొడవలు పడుతుండే వారని ఈనెల 13వ తేదీ సాయంత్రం చంద్రయ్య భార్యతో గొడవ పెట్టుకొని 14వ తేదీ ఉదయం పనికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి సాయంత్రం ఇంటికి రాకపోవడంతో ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదని 15వ తేదీన గ్రామ దుందుభీ నది సమీపంలో చెట్టుకు తాడుతో ఉరి వేసుకున్నాడని బుగ్గ స్వామి తెలియజేయడంతో అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందినట్లు తల్లి ఈదమ్మ తెలపడం జరిగిందని, ఎస్సై తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## ఇన్నోవేషన్ డే - ఏఐ కాన్‌క్లేవ్ నిర్వహణ

విద్యార్థులకు కృత్రిమ మేధస్సుపై అవగాహన



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** వీపనగండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 6వ రోజు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శివగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థుల కోసం ఇన్నోవేషన్ ఏఐ కాన్‌క్లేవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులకు కృత్రిమ మేధస్సు, ప్రస్తుత కాలంలో ఉన్న ప్రాధాన్యతను వివరించారు. విద్యారంగంలో ఏఐ వినియోగం, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు, సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధిలో ఏఐ పాత్ర వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శివ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తి పెంపొందించుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని సృజనాత్మకంగా వినియోగించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో సమాజ అభివృద్ధికి తోడ్పడే విధంగా తమ ప్రతిభను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

**ప్రజాపక్షం/కల్వకుర్తి:** కల్వకుర్తి మండల పరిధిలోని లింగసానిపల్లి,ఎల్లికట్ట గ్రామ సమీపంలో గల దుందుబి నది నుండిఅ క్రమంగా ఇసుకను తరలిస్తున్న 5 ట్రాక్టర్లను పట్టుకోవడం జరిగిందని కల్వకుర్తి ఎస్ ఐ కురుమూర్తి తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌లతో పాటు ట్రాక్టర్ యాజమానులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్సై యుగంధర్‌రెడ్డి

**ప్రజాపక్షం/ వెల్దండ :** సైబర్ నేరాల పట్ల ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని వెల్దండ ఎస్సై యుగంధర్‌రెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ అవరణంలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలియని ఫోన్ కాల్స్ ఎత్తకూడదని,ఓటీపీలు, బ్యాంక్ వివరాలు ఎవ్వరికి చెప్పడకూడదని,సోషల్ మీడియా ద్వారా వచ్చే నకిలీ లింక్‌లు అన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఏవైనా అనుమానాస్పద కాల్స్ లేదా సందేశాలు వచ్చిన వెంనటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ దామోదర్‌రెడ్డి, సైబర్ కానిస్టేబల్ మహేష్, బ్లూకోర్ట్ కానిస్టేబులు నాగమల్లయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# షెడ్యూల్ ప్రకారం ఓటరు జాబితా తయారీ

కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి మ్యాపింగ్ ప్రక్రియను పూర్తిచేసి, ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం ఫైనల్ ఓటరు జాబితాను తయారు చేయాల్సి ఉందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఎస్ఐఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై శనివారం హైదరాబాద్ నుంచి ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఐడిఒసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 76.54 శాతం మ్యాపింగ్ పూర్తయిందన్నారు. గద్వాల పురపాలికలో 52.99 శాతం మాత్రమే కావడంతో మెరుగైన పనితీరు కనబరచాలని ఆదేశించారు. గద్వాల మున్సిపాలిటీలో వార్డుల వారీగా సూపర్వైజర్లు, బిఎల్వోలు, వార్డ్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించాలని బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించేందుకు ఈనెల 19న రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఫైనల్ ఓటర్ జాబితా అక్టోబర్ 1న ప్రచురించాల్సి ఉన్నందున జూన్ 15 నుంచి 24 వ తేదీ వరకు బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికి తిరిగి ఓటరు జాబితాను సమగ్రంగా రూపొందించేందుకు అవసరమైన టర్ల డాక్యుమెంట్స్ సేకరించాల్సి ఉంటుందన్నారు. జులై 24 లోగా పోలింగ్ స్టేషన్ల రేషనలైజేన్, జులై 31 న ఎలక్ట్రోరల్ డ్రాఫ్ట్ ప్రచురించాల్సి ఉంటుందన్నారు. డ్రాఫ్ట్ సంబంధించి జులై 31 నుంచి అగస్టు 30వ తేదీ వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. సెప్టెంబర్ 28 లోగా క్లెయిమ్స్, అభ్యంతరాలపై డిస్పోజల్ చేసి అక్టోబర్ 1న ఫైనల్ ఎలక్ట్రోరల్ పబ్లికేషన్ చేయడం జరగుతుందన్నారు. కలెక్టరేట్‌లో, ఆర్డీవో కార్యాలయంలో ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, సి సెక్షన్ పర్యవేక్షకులు మంజుల, తహసిల్దార్ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ జానకి, రామ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఒండుమట్టి టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/ మక్తల్ :** ఒండు మట్టి తరించే టప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం అతి వేగం ఓ నిండు ప్రాణాన్ని బలితీసింది. గత వారం రోజులుగా నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో చెరువుల్ల ఒండు మట్టి తరలింపు పెద్ద ఎత్తున జరుగుతోంది. దీంతో ఒండు మట్టిని తరలించే టిప్పర్ డ్రైవర్లు అత్యంత నిర్లక్ష్యంగా ఓవర్ లోడుతో మితిమీరిన వేగంతో వెళుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. టిప్పర్ ఎదురొచ్చిందంటే పక్కకు తప్పుకునే పరిస్థితి ఉందని స్థానికులు అంటున్నారు. టిప్పర్ డ్రైవర్లు మితిమీరిన వేగంతో నిర్లక్ష్యంగా ఎదురొచ్చే వాహనాలు వ్యక్తుల పైకి వెళ్లే విధంగా రాష్ డ్రైవ్ చేస్తున్నట్లు ఆరోపణలు వినపడుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఒండు మట్టిని తరలిస్తూ పట్టణ సమీపంలోని గొల్లపల్లి క్రాసింగ్ వద్ద టివిఎస్ మెపెడ్ పై వెళుతున్న ఓ వ్యక్తిని టిప్పర్ ఢీకొట్టడంతో టిప్పర్ టైర్ల కింద నలిగి వ్యక్తి మృతి చెందాడు. వ్యక్తి పై టైర్లు ఎక్కడంతో తొడల నుంచి రెండు కాళ్ల భాగాలు పూర్తి ఎక్కడికక్కడ చెదిరిపోవడం జరిగింది. కేవలం టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అంటున్నారు. మృతుడు మక్తల్ మండలంలోని మంథన్ గోడ్ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. పేరు వివరాలు తెలియాల్సి ఉంది.

## డీజిల్,పెట్రోల్ ధరలను తగ్గించాలని ధర్నా

**ప్రజాపక్షం/ వెల్దండ :** కేంద్ర ప్రభుత్వం ఇటివలే డిజిల్, పెట్రోలు ధరలను పెంచి సామన్య పౌరుడుని నడ్డి విరుస్తున్నారంటూ కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అవేదన వ్యక్తం చేశారు. శనివారం మండల బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెంచిన నిత్యావసర సరుకుల ధరలను తగ్గిచాలంటూ ధర్నాకు పిలుపునివ్వడంతో ఈ ధర్నాకు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే పాల్గొన్ని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీజిల్, పెట్రోలు ధరలను అడ్డగోలుగా పెంచుతూ సామన్య ప్రజలపై మోయలేని భారం మోపారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను, రైతులు మోసం చేసి గద్దెనెక్కారని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పుట్ట రాంరెడ్డి, మాజీ జెడ్‌పిటిసి విజితారెడ్డి, చెర్కూర్ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు, నాయకులు జోగయ్య,జంగిలి నిరంజన్, లింగం ముదిరాజు, శక్రునాయక్, పోలే అశోక్, డీలర్ వెంకటయ్య, జంగిలి యాదగిరి,అంజినాయక్, దేవేందర్ ముదిరాజు, సిరుసనగండ్ల శేఖర్, మీసాల రాజు, జంగిలి ఆనంద్, గుద్దటి ప్రభాకర్, రామరాజు,లచ్చిరాంనాయక్, గండి కోట రాజు, ప్రసాద్, శంకర్‌నాయక్, పర్వతాలు, జోగు రవికుమార్ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి సమస్యల పరిష్కారానికి కూలీల ర్యాలీ



**ప్రజాపక్షం/ వీపనగండ్ల :** మండల పరిధిలోని పుల్గర్ చెర్ల గ్రామంలో శనివారం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పని బంద్ లో భాగంగా ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఉపాధి పని ప్రదేశం నుంచి తమ పనిముట్లతో ర్యాలీగా బయలుదేరిన కూలీలు గ్రామ సర్పంచ్ బాల్ రాజు, గ్రామపంచాయితీ కార్యదర్శి రవికి ఉపాధి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయకుండా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ. 600 కూలీ చెల్లించాలని, రైతు పొలాల్లో ఉపాధి పనులు చేపట్టాలని, ప్రతి జాబ్ కార్డుకు 200 పని దినాలు కల్పించాలని కోరారు. అలాగే పే స్లిపులు ఇవ్వడం, కూలీలకు పనిముట్లు అందించడం, పని ప్రదేశాలకు రాకపోకల కోసం ప్రభుత్వమే ఆటో సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి నెలకు రూ. 26 వేల వేతనం ఇవ్వాలని, కొత్త జీపీల సీనియర్ మేట్లను ఫీల్డ్ అసిసెంట్లుగా నియమించాలని, వర్క్ మేట్లకు నెలకు రూ. 5 వేల పారితోషికం ఇవ్వాలని కూడా వారు ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉపాధి కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ప్రజలను మరింత సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వ్యవస్థాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం. ఆంజనేయులు , రైతు సంఘం మండల నాయకులు మధుగని రాములు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం. ఆంజనేయులు, రైతు సంఘం మండల నాయకులు ఎం. రాములు, గ్రామ ఉపసర్పంచ్ చెన్నమ్మ, వార్డు సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ అధ్యక్షురాలు మన్నెమ్మ, కార్యదర్శి అలివేలు తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో ప్రజలపై భారం

ధరలు తగ్గించే వరకు సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి.ఫయాజ్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను నిరంతరం పెంచుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం మోపుతోందని సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి ఫయాజ్ తీవ్రంగా విమర్శించారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు నిర్వహించిన నాగర్ కర్నూల్ జిల్లాలో రాస్తారోకో, నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ప్రజల రక్తాన్ని పిండి కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే విధంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల వల్ల కేవలం వాహనదారులకే కాదు, సామాన్య ప్రజల జీవితమంతా తీవ్ర ప్రభావానికి గురువుతోందన్నారు. రవాణా ఖర్చులు పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, పేద, మధ్యతరగతి ప్రజలు జీవనం సాగించడం కష్టమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు వ్యవసాయ ఖర్చులు పెరిగి పంటలు సాగు చేయడం భారంగా మారిందన్నారు. ఆటో కార్మికులు, చిన్న వ్యాపారులు, కూలీలు, ఉద్యోగులు అందరూ ఈ ధరల పెంపుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గినా ప్రజలకు ఎలాంటి ఉపశమనం ఇవ్వకుండా ఎక్సైజ్ సుంకాల పెంచుతూ ఆరోపించారు. పెట్రోల్, డీజిలపై భారీ పన్నులు విధించి ప్రజల శ్రమను దోపిడీ చేస్తూ కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చడమే బిజెపి ప్రభుత్వ లక్ష్యంగా మారిందన్నారు. ప్రజల బాధలు పట్టని మోదీ ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్ పాలన వైపు నెడుతోంది. ఒకవైపు నిరుద్యోగం మరో వైపు ధరల పెరుగుదలతో ప్రజలు తీవ్ర సంకోభవంలో ఉన్నా కేంద్ర ప్రభుత్వం మాత్రం ప్రచార రాజకీయాల్లో మునిగిపోయింది. అని విమర్శించారు. సిపిఐ పార్టీ ప్రజలు పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందని, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఇంధన ధరలపై విధిస్తున్న అధిక పన్నులను రద్దు చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు హెచ్. ఆనంద జి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మర్యాద వెంకటయ్య, ఎఐఎస్‌ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్ కుమార్, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి బండి లక్ష్మీ పతి, ఎండి సయ్యద్ కాజా, రామచంద్రమ్మ, జి.రామకృష్ణ, సత్యం, విజయ్ , వెంకటస్వామి, శివ, చెన్నయ సుధాకర్, కొత్తకోట కర్రన్న బజ్జన్న, సీతయ్య, శివయ్య యాదమొని, తదితరులు పాల్గొన్నారు.

## చిరుధాన్యాల సాగుతోనే అధిక లాభాలు



**ప్రజాపక్షం/ వనపర్తి టౌన్ :** రైతుల సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా చిరుధాన్యాల (మిల్లెట్స్) సాగుపై దృష్టి సారించాలని, పంట మార్పిడి విధానాల ద్వారానే అధిక దిగుబడులు, లాభాలు సాధించవచ్చని భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ (ఐసిఎఆర్ ఐఐఎంఆర్) శాస్త్రవేత్తలు సూచించారు. శనివారం వనపర్తి మండలం అప్పాయిపల్లి గ్రామంలో ఐసిఎఆర్ ప్రధాన శాస్త్రవతేత్తలు డా॥ ఎ. కళైసేకర్, డా॥ కె. శ్రీనివాస బాబుల మార్గదర్శకత్వంలో రైతులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం, టార్పాలిన్ కవర్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పద్మా విష్ణు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఐసీఏఆర్ సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ జక్కుల భగవంతు యాదవ్ నేతృత్వం వహించారు. రూ. 3,500 విలువైన కవర్ల పంపిణీ ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 100 మంది ఎస్సీ సన్న, చిన్నకారు రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతుల పై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఒక్కొక్కరికి రూ. 3,500 విలువైన టార్పాలిన్ కవర్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దాసు, టియుడబ్ల్యూజే (ఐజెయు) వనపర్తి జిల్లా అధ్యక్షుడు మాధవ రావు, నాయకులు డి. ఆనందరావు, ఎస్. నాగేంద్రం, గ్రామ కార్యదర్శి నర్మదా, వ్యవసాయ అధికారి కురుమయ్య, రెవెన్యూ అధికారి వెంకటన్న, ఐపీఏఆర్ శాస్త్రవేత్తలు డాక్టర్ జీవిత, డాక్టర్ రాజశేఖర్, సిబ్బంది కోమలి, గ్రామ రైతులు పెంటమ్మ, సంధ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి విజయం సమాజ పురోగతికి పునాది

కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న " 99 రోజుల కార్యచరణ ప్రణాళిక ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక " లో భాగంగా నారాయణపేట జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన " విద్య విజయోత్సవాలు " కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యాశాఖ ఈ విద్యాసంవత్సరంలో నిర్వహిచిన వివిధ విద్యా, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలను నెమరువేసకుంటూ విద్యార్థుల ప్రతిభను గౌరవించింది. పదో తరగతి , ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, క్రీడారంగంలో జిల్లా స్థాయిలో అగ్రగాములుగా నిలిచిన విద్యార్థులు, ఎస్ఎస్‌సీ పరీక్షల్లో 560 పైగా మార్కులు సాధించిన మెరిట్ విద్యార్థులు, అలాగే 100 శాతం ఫలితాలు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ప్రశంసా పత్రాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక మాట్లాడుతూ, " విద్యా అనేది ప్రతి చిన్నారి భవిష్యత్తును తీర్చిదిద్దే మహత్తర శక్తి. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమాజ పురోగతికి బలమైన పునాది. నారాయణపేట జిల్లా విద్యార్థులు విద్య, క్రీడా, సాంస్కృతిక రంగాలలో కనబరిచిన ప్రతిభ అభినందనీయం. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి జిల్లాకు మరింత కీర్తి తీసుకురావాలి" అని ఆకాంక్షించారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎం. గోవిందరాజు మాట్లాతూ, " విద్యార్థుల విజయమే ఉపాధ్యాయుని నిజమైన గౌరవం. ఈ విద్యాసంవత్సరంలో జిల్లాలోని విద్యార్థులు సాధించిన విజయాలు విద్యాశాఖకు గర్వకారణం. ప్రతిభను గౌరవించడం ద్వారా మరింత మంది విద్యార్థులకు స్ఫూర్తి కలిగించడం మా లక్ష్యం " అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సదాశివరెడ్డి, వైస్ చైర్మన్ మంజుల, ఏఎంఒ విద్యాసాగర్, రాజేంద్ర కుమార్, శశికుమార్, నాగార్జున రెడ్డి, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బండి భగీరథ్‌ను అరెస్టు చేయాలి

సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో ధర్నా



**ప్రజాపక్షం/ అమరచింత :** మైనర్ బాలిక పై లైంగిక వేధింపులకు పాల్పడిన బండి సాయి భగీరథ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం అమరచింత మండల కేంద్రంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఐ (ఎంఎల్ ) మాస్ లైన్ పార్టీ సబ్ డివిజన్ కార్యదర్శి ప్రసాద్, డివిజన్ నాయకులు కే. రాజన్న, మస్ల మని, మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో మహిళలపై నిత్యం అఘాయిత్యాలు జరుగుతున్నా ప్రభుత్వాలు వీటిని అరికట్టడంలో విఫలం అయ్యారని ధ్వజమెత్తారు. ఉన్నోడిదే చట్టం అన్న చందంగా ఉన్నవాడు ఏమి చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో బండి భగీరథ్ మైనర్ బాలిక పై చేసిన లైంగిక దాడి సమాజానికంతటికి తెలిసినప్పటికీ ప్రభుత్వాలు అధికారులు బండి భగీరథ్‌ని అరెస్ట్ చేయడంలో జాప్యం చేస్తున్నారని వారు విమర్శించారు. దీనికంతటికి కారణం భగీరథ్‌కు రాజకీయ పలుకుబడి ఉండడమే కారణమని తెలిపారు. దేశంలో రాష్ట్రంలో మహిళల పై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడంలో పూర్తిగా విఫలం చెందాలని వారు విమర్శించారు. ఈ లైంగిక దాడిలో పాల్గొన్న బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని వారు డిమాండ్ చేశారు. పాత బస్టాండ్ సమీపంలో ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ముందర నిరసన తెలియజేస్తూ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కురుమన్న, జిలాని, విజయ్, తాజుద్దీన్, గీత భాయ్, రామ్ చందర్, జి. రంగన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తాం



కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్


**ప్రజాపక్షం/వంగూరు:** రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం శ్రీశైలం హైదరాబాదు ప్రధాన రహదారి సర్వారెడ్డిపల్లి తండా సమీపంలోని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను సంయుక్తంగా సందర్శించారు. ఈ సందర్భంగా కంపెనీలోని ఆధునిక యంత్రాలను ప్రాసెసింగ్ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సంస్థ నిర్వాహకులతో సమావేశమై మార్కెట్ విధానాలను రోజువారి ఉత్పత్తుల సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పడడం ద్వారా స్థానిక యువతకు ఉపాధితో పాటు ఈ ప్రాంతం అభివృద్ధి జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా స్థానిక రైతాంగానికి మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు చిమ్ముల రాజశేఖ్ రెడ్డి కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ పండిత్ రావు, సర్పంచ్ లు జీవన్ నాయక్, స్వర్ణ సంపత్ రావు, తహసిల్దార్, మురళీమోహన్, జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతితులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టర్ ను సన్మానించిన మార్కెట్ వైస్ చైర్మన్**

కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ను శనివారం కల్వకుర్తి మార్కెట్ వైస్ చైర్మన్ పండిత్ రావు సన్మానించారు. ఈ సందర్భంగా పండిత్ రావు మాట్లాడుతూ సర్వారెడ్డిపల్లి తండాలో ఏర్పాటు చేస్తున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయ పేర్కొన్నారు.



## గోవా టూర్‌లో విషాదం.. ఇద్దరు వ్యక్తులు దుర్మరణం





**ప్రజాపక్షం/ వనపర్తి :** గోవా టూర్ కు వెళ్తుండగా జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పెబ్బేరు పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటన కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పెబ్బేరు పట్టణానికి చెందిన నలుగురు యువకులు కారులో గోవాకు బమలుదేరారు. మార్గ మధ్యంలో హుబ్లీ దగ్గర రోడ్డు పై అగి ఉన్న లారీని వారి కారు వేగంగా వెళ్లి ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో తోకల రాజశేఖర్ (44), మహేష్(39) అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. మరో ఇద్దరు యువకులకు స్వల్ప గాయాలు కాగా, వారిలో భాను శంకర్ ఉన్నట్లు సమాచారం. మృతి చెందిన తోకల రాజశేఖర్ ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉండగా, మహేష్ కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబాలకు వీరే ఆధారంగా ఉండటంతో వారి మరణ వార్త తెలిసి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. గోవా సరదా యాత్రకు వెళ్లిన యువకులు మృతిచెందడంతో స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

